


సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
నిజామాబాద్ కామారెడ్డి
బుధవారం 13 నవంబర్ 2024 4 పేజీలు




## ఇంటింటి సమగ్ర సర్వేలో
# తప్పులకు తావివ్వొద్దు

### - జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**సూర్య రెంజల్**



ఇంటింటా సమగ్ర సర్వే నిర్వహణ సమయంలో ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్త పడాలని ఎన్యూమరేటర్లు కు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. రెంజల్ మండలంలోని అంబేద్కర్ నగర్ లో నిర్వహిస్తున్నటువంటి కుటుంబ సమగ్ర సర్వే పనితీరును మంగళవారం జిల్లా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణ కోసం నిర్వహిస్తున్న సమగ్ర సర్వే తీరును కలెక్టర్ క్షేత్రస్థా యిలో పరిశీలించారు. సర్వే కోసం హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ సందర్భంగా ఇళ్లకు అతికించిన స్టిక్కర్లపై నమోదు చేసిన వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సర్వే ఫారంలోని ప్రశ్నావళి ప్రకారం నిర్ణీత నమూనాలో సమాచారాన్ని సేకరిస్తున్నారా లేదా అన్నది తనిఖీ చేశారు. ప్రతి కుటుంబంలోని ఒక్కో వ్యక్తి వారీగా పూర్తి సమాచారాన్ని సేకరించాలని ఎన్యూమరేటర్ కు సూచించారు. ఇప్పటివరకు ఎన్ని ఇళ్లలో సర్వే పూర్తయ్యింది, కుటుంబ వివరాల సేకరణ సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఎదురయ్యా యా? కొత్తగా గమనించిన అంశాలు ఏమైనా ఉన్నాయా? అని ఆరా తీశారు. ఎన్యూమ ంటర్ రోజుకు సగటున కనీసం 15 ఇళ్లను సందర్శి స్తూ సర్వే ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రవణ్ కుమార్, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎంపీవో రఫీ అహ్మద్, ఆర్ఐ రవికుమార్, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గ్రూప్ - 3 పరీక్షలను
# పకడ్బందీగా నిర్వహించాలి

### - కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**సూర్య, కామారెడ్డి బ్యూరో**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-3 పరీక్షను పకడ్బందీగా, ఎలాంటి సమస్యలకు తావివ్వ కుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో గ్రూప్ 3 పరీక్ష నిర్వహణ పై సమావేశం నిర్వహించారు. ఈ నెల 17, 18 తేదీలలో జరిగే పరీక్షలకు ఏర్పాట్లపై అధికారు లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ., జిల్లాలో కామారెడ్డి పట్టణంలో 20 కేంద్రాలలో 8268 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని, ప్రతీ కేంద్రంలో సి.సి.కెమరాలు ఏర్పాటు చేయాలని, ఆయా కేంద్రాల్లో ఎవరిని అను మతించకూ డదని తెలిపారు. అన్ని కేంద్రాలను పోలీసు అధికారులు ముందస్తుగా స్క్రీనింగ్ చేయాలని తెలి పారు. కేంద్రానికి ప్రహరీ గోడ లేనట్లయితే అదనంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటుతో పాటు బయో మెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాలని తెలిపారు. అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించే

(మిగతా 2లో)



# శ్రీ లక్ష్మీ నృసింహునికి గరుడ సేవ

**సూర్య,భీమ్‌గల్**

నిజామాబాద్ జిల్లాలోని ప్రసిద్ధి చెందిన శ్రీ లింబాద్రి గుట్టపై శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ లక్ష్మీ నరసింహునికి గరుడ సేవ కార్యక్ర మాన్ని నిర్వహించారు. రాత్రి కొండపై శ్రీ లక్ష్మీ నరసింహుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో మంగళహారతులు, మేళా తాళాలు, భాజ భజం త్రీలు వెంటరాగా గరుడ వాహనంపై ప్రతిష్టించారు. రంగు రంగుల పూలు, స్వర్ణాభారణాలతో స్వామిని అలంకరించారు. పల్లకిలో ఆశీనులైన శ్రీ లక్ష్మీ నరసింహులను కొండ మాడ వీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తజనం పాల్గొన్నారు.



# 'కల్యాణలక్ష్మి' లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాలి

### - వేముల ప్రశాంత్ రెడ్డి
### - తలుపులు మూసి చెక్కుల పంపిణీ

**సూర్య భీమ్‌గల్**

కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు లక్ష రూపాయిలతో పాటు తులం బంగారం ఇవ్వాలని, మాజీ మంత్రి ,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో సహస్ర ఫంక్షన్ హాల్లో కళ్యాణ లక్ష్మీ,షాది ముభరక్ చెక్కుల పంపిణీ

(మిగతా 2లో)



## గ్రామాలు అభివృద్దే ధ్యేయంగా
# కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది

- విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి
- పదేళ్లు నిర్లక్ష్యానికి గురైన విద్య వ్యవస్థలో మార్పులు తెస్తున్నాం
- 3.75 కోట్లతో ఎక్కపల్లి, పోల్కంపేట్ హై లెవెల్ బ్రిడ్జి, పోల్కంపేటలో 20 లక్షలతో సబ్ సెంటర్ ల ప్రారంభం
- ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్మోహన్ రావ్

**సూర్య,లింగంపేట్**



విద్యార్థులు చదువులో ఉన్నతంగా రాణించి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్మోహన్ రావ్ అన్నారు.ఆయన మంగళవారం లింగంపేట్ మండల కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది ఏళ్లలో నిర్లక్ష్యానికి గురైన విద్య వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కాలేజీల్లో డ్రాప్ అవుట్ తగ్గించడంలో ముఖ్యంగా యువత కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను రెండవ విడుతలో

(మిగతా 2లో)

# గ్రూప్ - 3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**(మొదటి పేజీ తరువాయి)**

ముందు వారిని క్షుణ్ణంగా పరిశీలించి పంపించాలని, మగ, ఆడ అభ్యర్థులను విడివిడిగా వెరిఫై చేయాలని అన్నారు. ప్రతీ కేంద్రంలో సి.సి.కెమెరాలు, ఫర్నిచర్, త్రాగునీరు, మరుగుదొడ్లు, మెడికల్ టీమ్ ఉండేవిధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే పరీక్షకు నాలుగు రూట్లలో జాయింట్ రూట్ అధికారులతో విట్ చేయాలని తెలిపారు. ఆయా కేంద్రాల్లో అవసరమైన ఇన్విగిలేటర్లను నియమించుకోవాలని తెలిపారు. ఈ నెల 14 న శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు సమయానుకూలంగా పరీక్షకు ముందు, పరీక్ష అనంతరం ఆర్టీసీ బస్సులను నడిపించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ను ఆదేశించారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని విద్యుత్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ సెంటర్ లో ఫస్ట్ ఎయిడ్ కిట్ తో పాటు ఏ.ఎన్.ఏం. లను నియమించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని ఆదేశించారు. అభ్యర్థులు %ఉాజ% పోర్టల్ నుండి హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో శానిటేషన్ నిర్వహించాలని మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. అలాగే కేంద్రాల్లో ఎలాంటి పోస్టర్లు, హోర్డింగ్స్, ప్రచార సామాగ్రి లను తొలగించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్షల నిర్వహణ సమయంలో మూసివేయించాలని పోలీసు అధికారులకు సూచించారు. పరీక్ష హాలులోకి ఎవరిని కూడా సెల్ ఫోన్ అనుమతించబోమని, కేవలం చీఫ్ సూపరింటెండెంట్ లకు మాత్రమే అనుమతిస్తామని పేర్కొన్నారు. బయటి వ్యక్తులు, మీడియా ప్రతినిధులను పరీక్ష కేంద్రల్లోకి అనుమతించకూడదని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి అర గంట ముందే హాజరు కావాలని, సెల్ ఫోన్, క్యాలికులేటర్, ఎలక్ట్రానిక్ గూడ్స్, గాడ్జెస్ లను, ఎలాంటివి పరీక్ష హాలులోకి అనుమతించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షలను సాఫీగా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కు తావివ్వకుండా ప్రశాంతంగా నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి. విక్టర్ , అదనపు ఎస్పీ కే.నరసింహ రెడ్డి, డిఎస్పీ నాగేశ్వర్ రావు , రీజనల్ కో ఆర్డినేటర్ కే.విజయకుమార్, ఇన్చార్జి మున్సిపల్ కమీషనర్ వేణు గోపాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. చంద్రశేఖర్, జడ్పీ సిఈఓ చందర్, డి.ఈ. ఒ. రాజు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 'కల్యాణలక్ష్మి' లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాలి

**(మొదటి పేజీ తరువాయి)**

కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి చెక్కులతో పాటు ఇచ్చిన మాట ప్రకారం తులం బంగారంకూడా అందజేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వానికి పేదల పక్షాన విజ్ఞప్తి చేస్తున్నాన్నారు.కళ్యాణ లక్ష్మీ పథకాన్ని కొనసాగించడం శుభపరిణామం అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలత, కమ్మర్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, తహసీల్దార్ షబ్బీర్, కౌన్సిలర్లు ,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు

### తలుపులు మూసి చెక్కుల పంపిణీ

పట్టణంలో సహస్ర గార్డెన్స్ లో 224 లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ,షాది ముభారక్ కార్యక్రమంలో భాగంగా తలుపులు మూసి చెక్కులు పంపిణీ చేశారు.గతంలో వెల్పూర్ మండలంలో కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జరిగిన రసాభాస దృష్టిలో ఉంచుకొని కేవలం ప్రోటోకాల్ ఉన్న వారిని లోపలికి అనుమతించారు.దీంతో చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతుండగా బి. ఆర్.ఎస్ శ్రేణులు ఫంక్షన్ హాల్లో వెళ్ళారు.దీంతో తమరిని కూడా ఫంక్షన్ హాల్ లోకి అనుమతి ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు పోలీసులను కోరడంతో వాగ్వాదం జరిగింది.దీంతో ఒకేసారి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమంలో తమరిని అనుమతి ఇవ్వకపోవడం బాధకరమని కాంగ్రెస్ నాయకులు వాపోయారు. ఏది ఏమైనా పది సంవత్సరాల కాలంలో ఒకే పార్టీ అధికారం, ఆధిపత్యం నడిస్తే ప్రస్తుతం రెండు పార్టీలు బలం ఉండడంతో రానున్న ఎన్నికలు రసవత్తరంగా ఉంటాయని అక్కడ ఉన్న ప్రజలు, లబ్ధిదారులు చర్చించుకున్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

**సూర్య రెంజల్ :**

జిల్లాలో పెద్ద ఎత్తున వరి ధాన్యం దిగుబడులు చేతికందుతున్న నేపథ్యంలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశించారు. మంగళవారం రెంజల్ మండల కేంద్రంలో ఐకెపి మహిళా సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ కేంద్రానికి రైతులు తరలించిన ధాన్యం నిల్వలను, వాటి నాణ్యతను పరిశీలించారు. మాయిశ్చర్ మీటర్ ద్వారా ధాన్యం తేమ శాతాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం తీసుకువచ్చేలా విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సన్నరకం ధాన్యం



సేకరిస్తుండడాన్ని గమనించిన కలెక్టర్, ఇప్పటివరకు ఎంత పరిమాణంలో ధాన్యం కొనుగోలు చేశారు, ఇంకా ఎంత పరిమాణంలో ధాన్యం కేంద్రానికి వచ్చే అవకాశాలు ఉన్నాయని నిర్వాహకులను ప్రశ్నించారు. గత సంవత్సరం రబీ, ఖరీఫ్ సీజన్లలో కొనుగోలు కేంద్రం ద్వారా సేకరించిన ధాన్యం నిల్వల వివరాల గురించి ఆరా తీశారు. ఈసారి ముందస్తుగా కోతలు పూర్తయిన రైతులు పచ్చి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాలుకు సుమారు రూ. 2200 ధర చొప్పున విక్రయించుకున్నారని, కొంత ఆలస్యంగా పంట కోతలు జరిపిన రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెస్తున్నారని, గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం కొంత తక్కువ పరిమాణంలో ధాన్యం వస్తోందని కేంద్రం నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గోనె సంచుల కొరత, రవాణాపరమైన ఇబ్బందులు వంటివి ఏమీ లేవని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటదివెంట ధాన్యం కొనుగోళ్లు జరపాలని, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఏ పి.డి సాయాగౌడ్, ఐకెపి డీపీఎం సాయిలు, తహసీల్దార్ శ్రవణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్ ఐ రవికుమార్ ఐకెపి సీసీలు భాస్కర్, శ్యామల, తదితరులు ఉన్నారు.

## ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

**- గ్రూప్ -3 అభ్యర్థులకు కలెక్టర్ సూచన**

**సూర్య, నిజామాబాద్ :**

నిజామాబాద్ నుండి ఆర్మూర్ మార్గంలో అడవిమామిడిపల్లి వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పనులు కొనసాగుతున్న దృష్ట్యా ఈ నెల 17, 18 తేదీలలో గ్రూప్ -3 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిర్దేశిత సమయానికి ముందే తమకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. అడవిమామిడిపల్లి వద్ద ఆర్.యు.బి పనులు జరుగుతున్నందున నవంబర్ 10వ తేదీ నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు నెల రోజుల పాటు నిజామాబాద్ - ఆర్మూర్ మార్గంలో వాహనాల రాకపోకలను దారి మళ్లించడం జరిగిందని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రూప్-3 పరీక్షల కోసం ఆర్మూర్ వైపు వెళ్లాల్సిన అభ్యర్థులు ఆర్మూర్ నుండి నిజామాబాద్ వైపు వచ్చే అభ్యర్థులు ప్రత్యామ్నాయ మార్గాలలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉన్నందున నిర్దేశిత సమయం కంటే ముందుగానే బయలుదేరాలని కలెక్టర్ సూచించారు.



# గ్రామాలు అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది

**(మొదటి పేజీ తరువాయి)**

ఎల్లారెడ్డి నియోజకవర్గానికి మంజూరు చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను కోరమన్నారు.అనంతరం పోల్కంపేట్,ఎక్కపల్లి,హై లెవెల్ బ్రిడ్జి,3 కోట్ల75 లక్షలతో, పోల్కంపేట్ గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మాణం చేసిన సబ్ సెంటర్ లను ఆయన ప్రారంభించారు.గ్రామస్తుల ఉద్దేశించి మాట్లాడారు గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసం పల్లె దవకాను మంజూరు చేసి ప్రారంభించామన్నారు. సబ్ సెంటర్లో ఎప్పటికీ ఏఎన్ఎం ఉండేటట్లు చూస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారా గౌడ్, ల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, వైస్ చైర్మన్ జొన్నల రాజు,టీపీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీయొద్దిన్,డిఎంహెచ్వో చంద్రశేఖర్, తహసిల్దార్ నరేందర్,ఎంపీడీవో నరేష్, లింగంపేట్ వైద్యాధికారి హిమబిందు,మాజీ జెడ్పిటిసి శ్రీలత సంతోష్ రెడ్డి,సమన్వయ కమిటీ సభ్యుడు వంజరి ఎల్లమయ్య,టౌన్ అధ్యక్షుడు ప్రసాద్ గౌడ్,యూత్ అధ్యక్షుడు సుప్పల రాజు, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహిద్,దూరిశెట్టి అశోక్,నాగరాజు,అజయ్ గౌడ్,సాయిబాబా,సాజిద్ ఖాన్,శ్రీనివాస్ రెడ్డి, ఆగమయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని శవం ఆచూకీ లభ్యమైంది

**సూర్య, నాగిరెడ్డి పేట్**



నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోని జెగ్గ చెరువు ఒడ్డున సోమవారం గుర్తుతెలియని శవం లభ్యం కాగా, ఈ శవం ఆచూకీ లభ్యమైనట్లు, మృతుడు ఎల్లారెడ్డికి చెందిన షేక్ అహ్మద్ అలియాస్ షేక్ హైదర్ హుస్సేన్ ( 70 ) గా గుర్తించినట్లు స్థానిక ఎస్సై మల్లా రెడ్డి తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లారెడ్డికి చెందిన షేక్ అహ్మద్ కు మతిస్థిమితం సరిగ్గా లేదని, అటు ఇటు తిరుగుతూ ఇంటికి వచ్చివాడని, ఈ నెల 2 వ తేదీన ఇంటి నుంచి బయలుదేరిన ఆయన తిరిగి ఇంటికి రాలేదన్నారు. దీంతో అతని కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఆయన తెలిపారు. సోమవారం నాగిరెడ్డి పేట్ మండల కేంద్రంలోని జెగ్గ చెరువు ఒడ్డున గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు తెలియడంతో మృతుడి భార్య షేక్ అఫ్జల్ బీ, కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని చూసి గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. ప్రమాద వశాత్తు కాలుజారి చెరువులో పడి మృతి చెందినట్లు ఆయన తెలిపారు.శవం పూర్తిగా కుల్లిపోయి ఉండడంతో సంఘటన స్థలం వద్దే ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ దిలీప్ చే శవానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

## వికారాబాద్ కలెక్టర్ పై దాడి ఖండిస్తూ ఉద్యోగుల నిరసన

**సూర్య, నిజామాబాద్ :**



ప్రజలను రెచ్చగొట్టి అధికారులపై దాడికి పాల్పడ్డ వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సుమన్ కుమార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, కొడంగల్ డెవలప్మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డిపై కొంతమంది రైతుల ముసుగులో జరిపిన దాడిని టీఎన్జీవో స్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దీనికి నిరసనగా టీఎన్జీవో కేంద్ర సంఘ పిలుపు మేరకు ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి, విధులకు హాజరై నిరసన వ్యక్తపరచడం జరిగిందన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ విధులు నిర్వహిస్తున్న అధికారులపై ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని, భవిష్యత్తులో ఇలాంటివి సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని కోరారు. ఇలాంటి దాడులు సిగ్గుచేటని, దోషులు ఎంతటి వారైనప్పటికీ చట్ట పరిధిలో శిక్షలు విధించాలని సుమన్ డిమాండ్ చేశారు. జిల్లా అత్యున్నత అధికారైన కలెక్టర్ మీద జరిగిన దాడి పట్ల ప్రభుత్వం తప్పకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజాసేవలో ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నప్పటికీ పరిష్కరించుకునే మార్గం తప్పక ఉంటుందని, చట్టాన్ని తమ చేతిలో తీసుకొని అధికారులు, ఉద్యోగుల మీద దాడులు చేయడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శేఖర్, అసోసియేట్ అధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు, చిట్టి నారాయణరెడ్డి, కేంద్ర బాధ్యులు పోల శ్రీనివాస్, సలహాదారులు ఆకుల ప్రసాద్, కోశాధికారి దినేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు కేపీ.సునీత, సంజీవయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిలోనే నమ్మకం కోల్పోయింది

## - సమగ్ర సర్వేకు బిజెపి వ్యతిరేకం కాదు

## - నిజామాబాదు అర్బన్ ఎమ్మెల్యే సూర్య నారాయణ

**సూర్య, నిజామాబాద్**



తెలంగాణ సమాజం కాంగ్రెస్ ఏడాది పాలనను అసహ్యించుకుంటున్నారని 6నెలలకే ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయిందని నిజామాబాదు అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. 6గ్యారంటీలు అమలు చేయలేని రేవంత్ రెడ్డి ప్రభుత్వం 26రోజులు సంబరాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని ఆయన ఆరోపించారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శాసనసభ్యులు సూర్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 26 రోజుల విజయోత్సవాలపైన ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏమొఖం పెట్టుకొని ఉత్సవాలని వస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఏడాది పాలన మొత్తం కమిషన్లకు కసరత్తులు చేయడం, ఉన్నది లూటి చేయడానికే సరిపోయిందని అన్నారు. వంద రోజుల్లో అమలు చేస్తానన్న ఆరు గ్యారంటీలకు ఒక్క గ్యారంటీ పూర్తిగా అమలు చేసిన దిక్కు లేదని, విజయోత్సవాలు అనడానికి నైతిక హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. రైతన్నలకు రుణమాఫీ, పండించిన పంటలు కల్లాలలో ఉండి అకాల వర్షానికి నష్టపోయి రైతు కన్నీళ్లు పెడుతుంటే కాంగ్రెస్ కు విజయోత్సవాలా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రైతు రాబోసా ఎక్కడ పంట బోనస్ ఎక్కడని నిలదీశారు. యావత్ తెలంగాణ సమాజంలో ఏ వర్గ ప్రజలు మీతో సంబరాలు చేసుకోవాలో రేవంత్ సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో ఇచ్చిన గ్యారంటీలను, హామీలను డైవర్ట్ చేసే ప్రయత్నం చేద్దామనుకున్నారని, ప్రజలు ఇచ్చిన గ్యారంటీలు, హామీలు ఏమైనాయని అధికారులను ప్రశ్నిస్తున్న పరిస్థితి చూస్తున్నామన్నారు. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులు మూసిలో ముంచారా ఆరు గ్యారంటీలను గంగలో కలిపారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని సూర్య నారాయణ విమర్శించారు. సర్వేకు బిజెపి వ్యతిరేకం కాదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తెలంగాణలో పదేళ్లు బిఆర్ ఎస్ పాలనలో ఉద్యోగాలు రాక ఎందరు నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారో తెలుసుకుని వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికి రేషన్ కార్డు లేని కుటుంబాలు ఎన్నో ఉన్నాయని పెన్షన్ రానివాళ్ళు ఉన్నారని, తక్షణమే న్యాయం చేయలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, బిజెపి కార్పొరేటర్ మాస్టర్ శంకర్, బిజెపి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల టీకాల విషయంలో అవగాహన కల్పించాలి

**సూర్య బిక్కనూర్**



చిన్నారుల టీకాల విషయంలో చిన్నారు ల తల్లిదండ్రులకు అవగాహన కల్పిం చాలని, మండల ఇన్చార్జి వైద్యాధికారి దివ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి ఆవరణలో ఆశా కార్యకర్తలకు, ఆరోగ్య సిబ్బందికి చిన్నారుల టీకాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు వేసే టీకాల విషయంలో సమ యానుకులంగా వ్యవహరించాలని, పుట్టిన బిడ్డ నుండి 18 సంవత్సరాల లోపు వారికి టీకాలను ఎప్పుడు వేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, సూపర్వైజర్ రాజమణి, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

## నూతన మండల వ్యవసాయ అధికారిగా శృతి

**సూర్య రాజంపేట**



రాజంపేట మండలం లో నూతన మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన శృతి వ్యవసాయ రంగంలో పలు చర్యలను తీసుకోవాలని సంకల్పించారు. ముఖ్యంగా రైతుల కోసం పలు కార్యక్రమాలను తీసుకు వచ్చేందుకు ఆమె చర్యలు చేపడుతున్నారు. రాజ ంపేట రైతు వేదిక లో రైతులకు అవగాహన పెంచే కార్యక్రమాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించే విధానాలు వ్యాపార అవకాశాలను పొందే మార్గాలపై ఆమె కృషి చేస్తున్నారని తెలిపారు.ప్రతి మంగళవారం జరిగే రైతు నేస్తం కార్యక్రమం లో సాంకేతిక పరిజ్ఞానం, పంటలకు సంబంధించిన పరిశోధనలు, మార్కెట్ నైపుణ్యాలు, రైతుల అవసరాలకు అనుగుణంగా చక్కని మార్గదర్శకాలను అందించాలని ఆమె రైతులకు సూచించారు..ఈ కార్యక్రమంలో aeo లు పాలుగోన్నారు..

## ఘనంగా మల్లన్న ఆలయ వార్షీకోత్సవం

**సూర్య, నాగిరెడ్డి పేట్**



నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్ గ్రామంలోని మల్లన్న దేవాలయం నాల్గో వార్షీకోత్సవం మంగళవారం అత్యంత భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఈ ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మల్లన్న దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కుర్మ సంఘం నాయకులు అంజయ్య, సంగయ్య, పోచయ్య,విఠల్, రమేష్ తదిరతులు పాల్గోన్నారు.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

**సూర్య రెంజల్**



శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ ఆలయ నాలుగవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహి ంచారు. రెంజల్ మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుండి అమ్మవారికి అభిషేకాలు, పూజ కార్యక్రమాలను నిర్వహించి, యజ్ఞ హోమ కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్ఛారణలతో నిర్వహించారు. గత నాలుగు సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం ఆలయ వార్షికోత్సవం నిర్వహించడం జరుగుతుందని మరియు అలాగే ఈనెల 17వ తేదీన ఆదివారం రోజున బోనాల పండుగను నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం మేరకు అన్న ప్రసాదరణ వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ ఆలయ కమిటీ నిర్వాకులు, గ్రామ దేవాలయ కమిటీ నిర్వాహకలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పశువులలో సోకే వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దు

**సూర్య బిక్కనూర్**



పశువులలో సోకే వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని,మండల పశు వైద్యాధికారి దేవేందర్ సూచించారు. మంగళవారం మండలంలోని తిప్పాపూర్ లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి డాక్టర్ దేవేందర్ మాట్లాడుతూ పశువులలో సోకే గర్భకోశ వ్యాధుల వల్ల ఆవులు గేదలు, గర్భం దాల్చడం లేదని, వాటికి సరైన చికిత్సలు చేయించడం కోసం పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులకు పెద్ద ఎత్తున చికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకేంద్ర అధ్యక్షుడు కుంట లక్ష్మారెడ్డి, జంగంపల్లి పశువైద్యాధికారి అనిల్ రెడ్డి, సిబ్బంది మహేష్,సురేష్, భరత్, సందీప్, గంగారెడ్డి, ఏనుగు బాపురెడ్డి, శమర్తి రవి, రైతులు పాల్గొన్నారు

## మొబైల్ అంబులెన్స్ ద్వారా కంటి పరీక్షలు

**సూర్య, ఎడపల్లి**



ఎడపల్లి మండలం దుబ్బ తాండ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా అధికార ప్రతినిధి కరటూరి సూర్యనారాయణ ద్వారా మొబైల్ అంబులెన్స్ ద్వారా గ్రామస్తులకు మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 15 మందికి కంటి ఆపరేషన్లు నిర్ధారించినట్లు తెలిపారు. వీరికి బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రిలో ఉచిత శాస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు.దీంతోపాటు ఎడపల్లి మండలం లోని అన్ని గ్రామాలలో ద్వారా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు గంగారెడ్డి. కదం ప్రకాష్ రావు, తదితరులు ఉన్నారు.

## మాక్లూర్ విండో చైర్మన్‌గా బురోల్ల అశోక్

### - వైస్ చైర్మన్‌గా గుండారం శేఖర్

**సూర్య మాక్లూర్**



మాక్లూర్ విండో చైర్మన్‌గా బురోల్ల అశోక్,వైస్ చైర్మన్‌గా గుండారం శేఖర్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.భారీ బందోబస్తు నడుమ విండో చైర్మన్ ఎలక్షన్ నిర్వహించారు.ఈ సొసైటీ ఎన్నికలకు 6 గురు డైరెక్టర్లు గైర్వజరయ్యారు.చైర్మన్,వైస్ చైర్మన్ పదవులకు ఒక్కేసి నామినేషన్ రావడంతో చైర్మన్,వైస్ చైర్మన్ పదవులను ఎన్నికల అధికారి సత్యనారాయణ రావు ఏకగ్రీవంగా ప్రకటించారు.అనంతరం విండో చైర్మన్ అశోక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీ,మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కీ,ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి వినయ్ కుమార్ రెడ్డి కీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మాజీ విండో చైర్మన్ దయాకర్ రావు మాట్లాడుతూ గత టీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే మాక్లూర్ సొసైటీకీ సుమారు 2 కోట్ల నష్టం ఏర్పడిందన్నారు.బీఆర్ఎస్ నాయకులకు ఇక కాలం చెల్లిందన్నారు.ఒక మంచి నాయకుడు సొసైటీ చైర్మన్ గా ఎన్నికవ్వడం చాలా సంతోషకరంగా ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగాధర్ గౌడ్,వెంకటేశ్వర్ రావు,రవి ప్రకాష్,భరత్,విఠల్,జైల్ సింగ్, డైరెక్టర్లు,నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్,సౌత్ రూరల్ సీఐ సురేశ్ కుమార్, స్థానిక ఎస్ఐ రాజశేఖర్,నవీపేట్ ఎస్ఐ వినయ్,పోలీస్‌సిబ్బంది,పాల్గొన్నారు.

### వసతి గృహాలలోని మౌలిక వసతులు

## పెంచాలని బోధన్ సబ్ కలెక్టర్‌కి వినతి

**సూర్య, బోధన్**



ప్రభుత్వం త్వర త్వరగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్‌ను (HWO) ల సర్టిఫికెట్ వెరిఫికేషన్ తొందరగా పూర్తి చేస్తూ విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ స్టూడెంట్ పరిషత్ టీ.ఎస్.పి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మావురం శ్రీకాంత్ బోధన్ డివిజన్ సబ్ మెజిస్ట్రేట్ ని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ., వసతి గృహాలను ఉన్నటువంటి విద్యార్థులకు విద్యార్థినిలకు సంఖ్యకు సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేనందున విద్యార్థులకు రాత్రివేళలా తగినంత నిద్ర ఉండడం లేదని కాలకృత్యాలు తీర్చుకోవడానికి మూడు నాలుగు గంటల రాత్రి చలి ఎక్కువగా ఉన్న సమయంలో నిద్రలేచి విద్యార్థులు స్నానం చేయడం వలన జ్వరాలకు గురి అవుతున్నారని అలాగే ఇన్చార్జ్ వార్డెన్ ఉండటం వలన విద్యార్థులు చదువుకు ఇబ్బందిగా మారుతుందని అందువలన ఇన్చార్జ్ వ్యవస్థను కాకుండా హాస్టల్ కి ఒకే వార్డెన్ ఉండేట్టుగా HWO లను తొందరగా విధుల్లోకి తీసుకోవాలని బోధన్ సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ ని కోరడం జరిగిందని ఆయన అన్నారు.

## నాగిరెడ్డి పేటలో కుటుంబసర్వే 30 శాతం పూర్తి

**సూర్య నాగిరెడ్డి పేట్**



నాగిరెడ్డిపేట్ మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మంగళ వారం సాయంత్రం నాటికి వరకు 30 శాతం పూర్తి చేసునట్టు ఎంపీడీవో ప్రభాకర్ చారీ తెలిపారు. ఎంపీడీవో తో పాటు మండల ప్రత్యేక అధికారిణి రత్నం మండలంలోని చీనూర్, వదల్పర్తి గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వేను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో మొత్తం 10,076 కుటుంబాలున్నట్టు గుర్తించగా, అందులో 2,900 కుటుంబాలకు సర్వే చేయడం పూర్తయిందని తెలిపారు. మండలంలో సర్వేకోసం 78 ఎన్యూమరేటర్ బ్లాక్ లను ఏర్పాటు చేసి 67 మంది ఎన్యూమరేటర్ల ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. మండలంలో సర్వేను పకడ్బందిగా నిర్వహించాలని ఎన్యూమరేటర్లను ఆదేశించినట్టు తెలిపారు. ఎన్యూమరేటర్లు గ్రామాలలోని ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యధర్శులు సరేందర్, అజీమొద్దీన్ తదితరులు పాల్గోన్నారు.

